


నవభూమి

జిల్లా అనుబంధం

28 ఫిబ్రవరి,2025 శుక్రవారం పేజీలు:9

www.epaper.navabhoomi.in


# మా కలెక్టర్ పేదల పక్షపాతి!

- ❑ గుత్తి కోయల ఆవాసాలకు ద్విచక్ర వాహనంపై కలెక్టర్ జితేష్ వి పాటిల్
- ❑ రోడ్డు దగ్గరలోకి రండి సౌకర్యాలు కల్పిస్తాం
- ❑ చింతలమేదిలో 6 కుటుంబాలకు విజ్ఞప్తి





**కొత్తగూడెం ఫిబ్రవరి 27 నవభూమి ప్రతినిధి:** లక్ష్మీదేవి పల్లి మండలం పునుకుడుచెలక పంచాయతీ చింతల మేది, మద్ది గుంపు గుత్తి కోయ ఆవాసాలలో గుత్తి కోయల జీవన స్థితిగతులు, వారికి అందుతున్న మౌలిక వసతుల గురించి తెలుసుకునేందుకు గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా కలెక్టర్ మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్ తో కలసి గుత్తి కోయ ఆవాసాలకు ద్విచక్ర వాహనం మీద చేరుకున్నారు. అనంతరం ఆయన ఆవాసాలలో త్రాగునీరు కొరకు ఏర్పాటు చేసుకున్న చెలమలను పరిశీలించారు. అక్కడ ఉన్న గుత్తి కోయలతో ముచ్చటించి వారి యొక్క జీవన విధానం మరియు స్థితిగతులను, ఉపాధి గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారితో అటవీ సంపదను కాపాడాలని, పోడు కొట్టడం చట్ట వ్యతిరేకమని, ఎవరు చెట్లను నరకరాదని సూచించారు. గుత్తి కోయల అభివృద్ధి కొరకు నిత్యం కృషి చేస్తున్నామని, విద్య, వైద్య, రవాణా సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. విలువైన జీవితాన్ని అందించడానికి గాను మరియు త్రాగునీరు, మౌలిక వసతులు కల్పించడానికి సరైన రహదారి మార్గం కూడా లేనందున చింతల మెదిలో నివసించే 6 కుటుంబాల వారు రోడ్డుకు చేరువుగా రావాలని దాని ద్వారా అన్ని మౌలిక వసతులు, సౌకర్యాలు అందిస్తామని కలెక్టర్ సూచించారు. గ్రామస్తులు త్వరలో తమ నిర్ణయం తెలియజేస్తామని కలెక్టర్ కు తెలిపారు. గ్రామంలో త్రాగునీరు కోసం సంపు నిర్మాణం చేపట్టాలని మిషన్ భగీరథ ఈఈని ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఎంపీడీవో చలపతిరావు, మిషన్ భగీరథ డి ఈ శివయ్య, ఏఈ వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శులు, అటవీ శాఖ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు

# ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

- ❑ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**కొత్తగూడెం ఫిబ్రవరి 27 నవభూమి ప్రతినిధి:** వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన పోలింగ్ ప్రక్రియ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 23 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల పోలింగ్ చేపట్టామని, జిల్లాలో మొత్తం 2022 మంది ఓటర్లకు గాను 1859 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, పోలింగ్ శాతం 91.94 శాతంగా నమోదయిందని తెలిపారు. ఇందులో పురుషులు 973, మహిళలు 886 ఉన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం కట్టుదిట్టమైన భద్రత మద్య బ్యాలెట్ బాక్స్ లను నల్గొండ రిసెప్షన్ సెంటర్ కి తరలించనున్నట్లు తెలిపారు. జిల్లాలో పోలింగ్ ప్రక్రియ విజయవంతనికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

# సీతారామ కెనాల్ పనులను వేగవంతం చేయాలి

- ❑ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**కొత్తగూడెం / అన్నపురెడ్డిపల్లి ఫిబ్రవరి 27 నవభూమి ప్రతినిధి:** అన్నపురెడ్డి పల్లి మండలం ఎర్రగుంట వద్ద చేపడుతున్న సీతారామా లిఫ్ట్ ఇరిగేషన్ కెనాల్ పనులను గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కెనాల్ పనుల పురోగతి పై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కెనాల్ పనులను వేగవంతం చేయాలని అధికారులు ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ పనులు త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా నీటిని పంపుల ద్వారా తరలింపు చేపట్టాలని, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ఇరిగేషన్ శాఖ ఎస్సీ శ్రీనివాస్ రెడ్డి, ఈఈ అర్జున్ రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

- ❑ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ❑ ఉదయం 10.00 గంటల వరకు 20.35 శాతం పోలింగ్
- ❑ మధ్యాహ్నం 12.00 గంటల వరకు 54.34 శాతం
- ❑ మధ్యాహ్నం 2.00 గంటల వరకు 79.53 శాతం
- ❑ సాయంత్రం 4.00 గంటల వరకు 93.05 శాతం
- ❑ రిక్కాబజార్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో










**ఖమ్మం నవభూమి బ్యూరో, ఫిబ్రవరి 27:** జిల్లాలో ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించినట్లు, సాయంత్రం 4.00 గంటల వరకు 93.05 శాతం పోలింగ్ నమోదు అయిందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్, ఖమ్మం రిక్కా బజార్ హైస్కూల్ లో ఉన్న టీచర్స్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ శాసన మండలిలో టీచర్స్ స్థానాల ఎన్నికల పోలింగ్ కోసం జిల్లాలో ఏర్పాటు చేసిన 24 పోలింగ్ కేంద్రాలలో టీచర్స్ తమ ఓటు హక్కును వినియోగించుకున్ ట్లు తెలిపారు. జిల్లాలో 4089 మంది టీచర్ ఓటర్స్ ఉన్నారని, ఉదయం 8.00 గంటల నుంచి ఉదయం 10.00 గంటల వరకు 20.35 శాతం, మధ్యాహ్నం 12.00 గంటల వరకు 54.34 శాతం, మధ్యాహ్నం 2.00 గంటల వరకు 79.53 శాతం, సాయంత్రం 4.00 గంటలకు 93.05 శాతం పోలింగ్ నమోదు అయిందని తెలిపారు. సాయంత్రం 4.00 గంటల వరకు టీచర్స్ ఎన్నికలలో 3805 మంది ఓటు వేయగా, అందులో 2218 మంది పురుష ఓటర్లు, 1587మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత నల్గొండలో ఉన్న రిసెప్షన్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్‌లను తరలించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల కోసం అవసరమైన బందోబస్తు, ఏర్పాట్లు పోలీసులు కట్టుదిట్టంగా చేశారని, పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ అన్నారు

# ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**కొత్తగూడెం/పాల్వంచ ఫిబ్రవరి 27 నవభూమి ప్రతినిధి:** టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. సింగరేణి కాలరీస్ బాలికల ఉన్నత పాఠశాల పాల్వంచ బొల్లోరుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి, అక్కడ విధులలో ఉన్న అధికారులకు జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకున్న

## టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రెడ్డి





**భద్రాచలం ఫిబ్రవరి 27 నవభూమి ప్రతినిధి:** తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. ముందుగా బ్రిడ్జి సెంటర్ నందు పటేల్ రెడ్డికి టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి రమేష్ గౌడ్, సరేళ్ళ నరేష్ తదితరులు స్వాగతం పలికారు. తదుపరి టూరిజం చైర్మన్ ని స్థానిక ఎమ్మెల్యే వెంకట్రావు మర్యాదపూర్వకంగా కలిసి టూరిజం హోటల్ అభివృద్ధిపై పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పట్టణ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్

## 93.94 పోలింగ్ శాతం నమోదు

## ఆర్డీవో రాజేందర్



**కల్లూరు, నవభూమి, ఫిబ్రవరి 27:** కల్లూరు డివిజన్ పరిధిలో ఆరు మండలాలలో జరిగిన వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసిందని, కల్లూరు ఆర్డీవో రాజేందర్ గౌడ్ అన్నారు. కల్లూరు 94.68 శాతం, సత్తుపల్లి 93.50 శాతం, వేంసూరు 98.46 శాతం, పెనుబల్లి 95.24 శాతం, తల్లాడ 100 శాతం, ఏన్కూరు 86.67 శాతం నమోదైనట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో మొత్తం పోలింగ్ 93.94 శాతం నమోదయిందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన వారికి ఆర్డిఓ కృతజ్ఞతలు తెలిపారు. సిసి కెమెరాల పర్యవేక్షణలో, బందోబస్తు మధ్య పోలింగ్ జరిగింది. ఆరు మండలాల్లో జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను, ఆర్డిఓ ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రశాంతంగా ముగిసేందుకు కృషి చేశారు.

# డ్రైనేజీ దుర్గంధంతో ప్రజలు పరేషాన్

## నవభూమి కథనానికి స్పందన

**మంచిర్యాల జిల్లా భీమారం ప్రతినిధి ఫిబ్రవరి 27 (నవభూమి):** భీమారం మండల కేంద్రంలో పెరకవాడలో డ్రైనేజీ దుర్గంతో ప్రజలు పరేషాన్ అనే కథనానికి స్పందించిన అధికారులు పారిశుద్య కార్మికుల చేత పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి పూడికతీత తీయించి సానిటేషన్ చేయించారు. నవభూమి కథనానికి అధికారులు వెంటనే స్పందించడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు

# చిన్న పరిశ్రమలు బతకాలంటే సింగరేణి బొగ్గు ధర తగ్గించాలి

- విద్యుత్తేతర బొగ్గు వినియోగదారుల విజ్ఞప్తి
- సింగరేణి మార్కెట్‌ను రక్షించుకునేందుకు అన్ని చర్యలు: సిఎండి బలరామ్






**కొత్తగూడెం ఫిబ్రవరి 27 నవభూమి ప్రతినిధి:** బొగ్గు ఆధారిత సిమెంటు, స్పాంజ్, ఐరన్, సిరామిక్స్, ఫార్మా వంటి పరిశ్రమలు నేటి క్లిష్ట మార్కెట్ పరిస్థితుల్లో మనుగడ సాగించాలంటే సింగరేణి సంస్థ తన బొగ్గు ధరను తగ్గించాల్సిన అవసరం ఉందని విద్యుత్తేతర పరిశ్రమల యాజమాన్యాలు సింగరేణి సంస్థకు మొర పెట్టుకున్నాయి.ముఖ్యంగా తమ పరిశ్రమల మనుగడ, తమపై ఆధారపడిన వేల మంది స్థానిక చిరు ఉద్యోగుల భవిష్యత్ దృష్ట్యా తక్కువ ధరకు బొగ్గును విదేశాల నుంచి లేదా ఇతర బొగ్గు సంస్థల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందన్నారు. తొలిసారిగా అన్ని ఏరియాల జీఎంలు, క్వాలిటీ జీఎంలు, క్వాలిటీ ఇన్చార్జిలతో కలిసి సింగరేణి భవన్ లో గురువారం సంస్థ నిర్వహించిన విద్యుత్తేతర వినియోగదారుల సమావేశంలో దాదాపు 60కి పైగా సంస్థల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. గత ఏడాది సింగరేణి ఉత్పత్తి చేసిన 70 మిలియన్ టన్నుల బొగ్గులో 9 మిలియన్ టన్నులను విద్యుత్తేతర వినియోగదారులు కొనుగోలు చేశారని,ఈ ఏడాది కేవలం 5 మిలియన్ టన్నులను మాత్రమే తీసుకోవడానికి కారణాలను ఈ సందర్భంగా సీఎండీ ఎన్.బలరామ్ తెలుసుకున్నారు.

దీనిపై అన్ని సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ... సింగరేణి తో తమకు దశాబ్దాల అనుబంధం ఉందన్నారు. రవాణా సమస్యలు లేకుండానే సింగరేణి నుంచి బొగ్గు తీసుకునే అవకాశం కూడా ఉందన్నారు.కానీ, పోటీ మార్కెట్లో ఇప్పటికే తాము ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నామని, సింగరేణి బొగ్గు ధరలు ఎక్కువ ఉన్నందున తాము అంతకన్నా తక్కువ ధరకు లభిస్తున్న కోలిండియా, విదేశీ బొగ్గు వైపు మొగ్గు చూపాల్సి వస్తుందని పేర్కొన్నారు.దూర ప్రాంతాల నుంచి బొగ్గును కొనుగోలు చేస్తున్నప్పటికీ సింగరేణి ధరతో పోల్చితే తక్కువకే లభిస్తోందన్నారు. బొగ్గు ధరను తగ్గిస్తే సింగరేణి నుంచి స్వీకరించడానికి సంసిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. బొగ్గు నాణ్యత విషయంలోనూ లేవనెత్తిన అంశాలపై సంబంధిత అధికారులకు సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశాలు జారీ చేశారు.నాణ్యత విషయంలో కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వినియోగదారుల ప్రయోజనాలను,సింగరేణి మార్కెట్ను రక్షించుకునేందుకు అవసరమైన అన్ని చర్యలపై సమాలోచనలు జరిపి తగిన నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన రోజుల్లో సింగరేణి నుంచి బొగ్గును స్వీకరించాలని కోరారు. త్వరలో మరొక సమావేశాన్ని కూడా ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. సమావేశంలో డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు (ఈ అండ్ ఎం),ఎల్వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), ఎగ్జిక్యూటివ్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం.సుభానీ, జీఎం(మార్కెటింగ్) డి.రవి ప్రసాద్, జీఎం(సీపీపీ) మనోహర్, ఓఎస్డీ (మార్కెటింగ్) ఎన్.వి.రాజశేఖరరావు, డీజీఎంలు ,సురేందర్ రాజు, శ్రీవాస్తవ, అడిషనల్ మేనేజర్ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నవభారత్, ఐటీసీ, ఓరియంట్ సిమెంట్, అల్ట్రా టెక్ సిమెంట్, దివీస్ ల్యాబరేటరీస్, హెటిరో ఫార్మా, సిర్పూర్ పేపర్ మిల్స్ తదితర సంస్థల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు

# బిఆర్ఎస్‌పై విమర్శలతోనే కాలం గడుపుతున్న రేవంత్ రెడ్డి

- అమలుకు నోచని హామీలు
- 445 రోజుల్లో ప్రజలకు ఒరిగిందేమీ లేదు
- మంత్రివర్గ విస్తరణ లేదు
- గ్రామాల్లో పేరాచూట్ లీడర్ల దే పెత్తనం
- పిసిసి అధ్యక్షుడి పరిస్థితి అగమ్య గోచరం
- భీమిరెడ్డి పుల్లారెడ్డి విమర్శ



**సత్తుపల్లి, నవభూమి, ఫిబ్రవరి 27 :** ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై విమర్శలతోనే కాలం గడుపుతున్న రేవంత్ రెడ్డి పాలన అస్తవ్యస్తంగా ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ మాజీ డైరెక్టర్ భీమిరెడ్డి పుల్లారెడ్డి విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేసి 445 రోజులు అయినప్పటికీ రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ప్రతి అంశాన్ని కేసీఆర్ కుటుంబంతో ముడిపెట్టి విమర్శలు చేస్తుండటంతో ప్రజల్లో రేవంత్ పై వ్యతిరేకత పెరుగుతోందన్నారు. గత పాలకుల వైఫల్యాలే కాంగ్రెస్ పార్టీకి విజయం అన్నారు. ప్రతి సందర్భంలోనూ ప్రజలకు వాటిని గుర్తు చేయాల్సిన అవసరం లేదన్నారు. మీరు చేస్తున్న పనులను వివరించడం ద్వారా ప్రజలను ఆకర్షించాలన్నారు. రాజకీయ కక్ష సాధింపుల వలన ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. లోపాలుంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత విమర్శలతో కాలం గడిపితే భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష పాత్రకే పరిమితం అవుతుందన్నారు. గత పాలనలో జరిగిన వైఫల్యాలను సరిదిద్దుకే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారన్న వాస్తవాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అమలు కానీ హామీలతో అస్తవ్యస్త పరిపాలన సాగించడం భవిష్యత్తుకు మంచిది కాదన్నారు. 15 నెలల పరిపాలన కాలంలో సాధించిన ఘనవిజయాలు ఏమీ లేవు అన్నారు. రాష్ట్ర అప్పు మాత్రం కొత్తగా రూ. 150,000 కోట్లకు పెరిగిందన్నారు. ఆదాయ వనరులు తగ్గాయన్నారు. పెంచే మార్గం ఆలోచించడం లేదన్నారు. మంత్రివర్గంపై పట్టు లేకుండా పోయిందన్నారు. ఆరు గ్యారంటీల అమల్లో వాగ్దాన భంగమే జరిగిందన్నారు. గత సంవత్సరం మార్చి బడ్జెట్ లోనే నియోజకవర్గానికి 3500 ఇళ్లు ఇందిరమ్మ పథకంలో భాగంగా నిర్మిస్తామని అసెంబ్లీ సాక్షిగా వెల్లడించారన్నారు. బడ్జెట్ కేటాయింపులు జరపలేదన్నారు. ఇంతవరకు ఎక్కడా ఒక ఇంటిని కూడా నిర్మించలేద న్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ సాగుతూనే ఉందన్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇంజనీరింగ్ సిబ్బందిని గృహ నిర్మాణ శాఖకు కేటాయించలేదన్నారు. కౌలు రైతుకు ఇస్తానన్న రూ.15 వేల రూపాయలు ఇవ్వలేదన్నారు. వ్యవసాయ కూలీలకు ఇస్తానన్న రూ.12000 రూపాయలు ఇస్తారన్న నమ్మకం లేదన్నారు. మహిళలకు ప్రతినెలా ఇస్తాన్న 2500, నాలుగు వేలకు పెంచుతానన్న ఆసరా పెన్షన్ అమలు చేస్తారన్న నమ్మకం ఆ వర్గాలకు పోయిందన్నారు. అన్ని పంటలకు బోనస్ ఇస్తానన్న హామీ వరిలో సన్న వడ్లతో సరిపెట్టారన్నారు. తెలంగాణలో అత్యధికంగా పండే మిర్చిని కొనే నాథుడు లేడన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి మద్దతు ధర ఇప్పించడంలో రేవంత్ సర్కార్ విఫలమైందన్నారు. పాలనలో అవినీతి పెరిగిందన్నారు. జవాబు దారి తనం లోపించిందన్నారు. మంత్రుల మధ్య సఖ్యత లేదన్నారు. ఎవరికి వారే యమునా తీరు అన్నట్లుగా ఉన్నారన్నారు. ఎవరి దారి వాడిదైతే పాలనలో సమన్వయం లోపిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. ఏ పనికి ఎవరిని కలవాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. నియోజక వర్గాల్లో కొత్తగా అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. నిధుల కేటాయింపులో కొత్త ఎమ్మెల్యేల పట్ల వివక్షత చూపుతున్నారన్నారు . గ్రామాల్లో షాడో ఎమ్మెల్యేల సంఖ్య పెరిగిందన్నారు. పారాచుట్ల పెత్తనం ఎక్కువై పాత కాంగ్రెస్ నాయకుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కొత్త వారి చేరికతో గ్రామాల్లో గ్రూపులు పెరిగాయన్నారు. కష్ట కాలంలో పనిచేసిన వారిని ప్రక్కన పెడుతున్నార న్నారు. సమస్యలు పరిష్కారం కాక ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకత పెరిగిందన్నారు. ఎంపీల పనితీరు ఏమీ బాగోలేదు అన్నారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి నిధులను రాబట్టడం లో వైఫల్యం చెందారన్నారు. పిసిసి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మహేష్ కుమార్ గౌడ్ ఆరు నెలలైనా కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇలాగైతే కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో నమ్మకం సన్నగిలుతుందన్నారు.

# సకల చెడులను దహించి, మంచి మానవతా విలువలు పెంచి, మనిషిని మహనీయునిగా మలిచే మాసం రంజాన్ మాసం



**కొత్తగూడెం ఫిబ్రవరి 27 నవభూమి ప్రతినిధి:** ఆకలి బాధ అర్థం చేసుకుని, అన్నార్తుల ఆకలి తీర్చేలా చేసే మాసం. ఉపవాసాల మాసం, అదే అదే రంజాన్ మాసం. చెడు చూడకు, చెడు వినకు, చెడు మాట్లాడకు, చెడు చేయకుండా నిలిపి ఉంచే మాసం ఉపవాసాల మాసం, అదే అదే రంజాన్ మాసం. సృష్టి కర్త ను ఎవరో తెలిపి, జీవిత పరమార్థం పరిచయం చేసిన మానవాళి మార్గదర్శి ఖురాన్ గ్రంథం అవతరించిన మాసం ఉపవాసాల మాసం, అదే అదే రంజాన్ మాసం. సత్ సమాజ నిర్మాణానికి, సహన గుణం అలవర్చుకునేలా చేసే మాసం ఉపవాసాల మాసం. అదే అదే రంజాన్ మాసం. సకల జనులు సుఖ సంతోషాలతో, శాంతి సౌఖ్యాలతో సహజీవనం సాగించేలా చేసే మాసం. ఉపవాసాల మాసం. అదే అదే రంజాన్ మాసమని షేఖ్ అబ్దుల్ బాసిత్ సందేశమిచ్చారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం, ఓటింగ్ సరళిని పరిశీలించిన తహసిల్దార్





**ఎర్రుపాలెం, నవభూమి, ఫిబ్రవరి 27:** ఖమ్మం-నల్గొండ-వరంగల్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం మండలంలో ప్రశాంతంగా జరిగిందని తహసిల్దార్ మన్నె ఉషా శారద తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని ఎర్రుపాలెం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. పోలింగ్ సరళని తాసిల్దార్ ఎస్సై వెంకటేష్ తో కలిసి గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలోని వసతులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో మొత్తం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్లు 59 ఉన్నాయని తాసిల్దార్ తెలిపారు. ఇటీవల ఒక ఉపాధ్యాయుడు మృతి చెందారు. 58 ఓట్లకు గాను 55 ఓట్లు(93.22%) పోలయ్యాయని తాసిల్దార్ తెలిపారు. పురుషులు 31, స్త్రీలు 24 మంది ఓటు హక్కును వినియోగించు కున్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో మొత్తం 19 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. యుటిఎఫ్ అభ్యర్థిగా నర్సిరెడ్డి రెండోసారి పోటీలో ఉండగా, పిఆర్ టియు అభ్యర్థిగా శ్రీపాల్ రెడ్డి, బిజెపి బలపరుస్తున్న పులి సర్వోత్తమరెడ్డి మరి కొంతమంది స్వతంత్రఅభ్యర్థులు రంగం లో ఉన్నారు. తమతమ యూనియన్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఓటు వేయాలని యుటిఎఫ్, పిఆర్ టియు మండల బాధ్యులు ఓటర్లను అభ్యర్థించారు. బిజెపి బలపరుస్తున్న సర్వోత్తమ రెడ్డికి ఓటు వేయాలని మండల బిజెపి నాయకులు అభ్యర్థించారు

# మండలంలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

■ అంగరంగ వైభవంగా శివ కళ్యాణం









**ఎర్రుపాలెం, నవభూమి, ఫిబ్రవరి 27 :** మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలలోని శివాలయాలలో మహాశివరాత్రి పండుగను పురస్కరించు కొని బుధవారం ప్రత్యేక పూజలు, రుద్రాభిషేక ములు, శివకళ్యాణములు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జమలాపురం శ్రీవెంకటేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగ ణం లోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం లో అర్చకులు మార్తీ వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు రుద్రాభి షేకములు నిర్వహించారు. రాత్రికి ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో నూజివీడు గ్రామానికి చెందిన శ్రీ సోమేశ్వరస్వామి ఆలయ నిర్మాణదాత స్వర్గీయ పేర్ల సోమేశ్వర రావు కుటుంబ సభ్యులు స్వామివారికి పట్టు వస్త్రములు, తలంబ్రాలు, కళ్యాణము నకు అవసరమైన పూజాసామాగ్రిని తీసుకుని వచ్చి పిటలపై కూర్చొని శివకళ్యాణంను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదములు అందించారు. అదేవిధంగా గ్రామంలోని సదాశివుని గుట్టపై గల శివాలయంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎర్రుపాలెం సొసైటీ అధ్యక్షులు మూల్పూరి శ్రీనివాసరావు, ఎర్రంరెడ్డి నాగేశ్వర రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు మహాఅన్నదానం నిర్వహించారు. ఆలయం వద్ద వివిధ సంస్కృతి కార్యక్రమాలు, మహిళ లు కోలాటం నిర్వహించారు. వెంకటా పురం గ్రామంలోని శివాలయంలో బొగ్గుల గోవర్ధన రెడ్డి, వెన్నపూస కృష్ణారెడ్డి, గ్రామ స్తుల సహకారంతో ఉదయం నుండి ప్రత్యేక పూజలు, శివకళ్యాణం ఘనంగా నిర్వహించారు. బనిగళ్ళపాడు గ్రామం లోని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం లో ఆలయకమిటీ బాధ్యులు యన్నం పిచ్చిరెడ్డి, మోహన్ రావు, దాత వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం నుండి పూజలు నిర్వహించిమహాఅన్నదానం, శివకళ్యాణం నిర్వహించారు. రెండు రాష్ట్రాల స్థాయిలో కబడ్డీపోటీలు నిర్వహించారు. ఎర్రుపాలెం లోని శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం లో అర్చకులు ఉదయం నుండే ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం నిర్వహించారు. మీనవోలుసమీపంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలయంలో అర్చకులు చీమకుర్తి సుబ్బాచారి ఆధ్వర్యంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారి దివ్య కళ్యాణం, మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఉన్న అన్ని శివాలయాలు శివనామ స్మరణతో మారుమోగాయి

# పంచాయతీ ఆవరణలో చెట్ల నరికివేత

■ నీడనిచ్చే చెట్లను ఎందుకు నరికారు..?

■ అధికారుల నిర్లక్ష్యం వల్లే చెట్లు నరికారు

■ పోలీసులకు ఫిర్యాదు చేశామన్న సెక్రెటరీ



**కల్లూరు, నవభూమి, ఫిబ్రవరి 27:** తెలంగాణ ప్రభుత్వం కోట్లాది రూపాయలు హెచ్చించి, గత కొన్ని సంవత్సరాలుగా హరితహారం కార్యక్రమం చేపట్టి మొక్కలు నాటుతున్నారు. అందరూ మొక్కలు నాటే విధంగా ప్రజలను ప్రోత్సహిస్తూ, నాటిన మొక్కలను కాపాడే బాధ్యత పంచాయతీ అధికారుల పాత్ర ముఖ్యంగా ఉంటుంది. కానీ వీటన్నిటికీ విరుద్ధంగా మండల పరిధిలోని పేరువంచ గ్రామంలోని గ్రామపంచాయతీలో జరిగింది. పంచాయతీ ఆవరణలో ఉన్న నాలుగు పెద్ద పెద్ద చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికారంటూ కార్యాలయ సెక్రటరీ కే రాజు వివరణ ఇవ్వటం విడ్డూరంగా ఉంది. 4 చెట్లు నరికివేతపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసామని సెక్రటరీ తెలిపారు. ఈ విషయమై గ్రామస్తులు కీసర రవీందర్ రెడ్డి, కీసర వంశి, మెంతుల అనిల్, మట్టెల సమ్మేష్ తదితరులు మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయానికి చెందిన ఏ సమావేశం జరిగినా, ఏ సభ జరిగినా ఇదే చెట్ల కింద సమావేశమవుతామని, కార్యాలయానికి వచ్చే ప్రజలు చెట్ల కింద సేద తీర్చుకుంటారని, ఎంతో నీడనిచ్చే గానుగ చెట్లను నరికివేత పై తీవ్రంగా మండిపడ్డారు. కార్యాలయ అధికారుల నిర్లక్ష్యం వల్లే చెట్లు నరికేసారని, చెట్లు నరికిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# సకాలంలో రుణాలను చెల్లించండి

■ డిసిసిబి బ్యాంకు మేనేజర్ సతీష్



**ములకలపల్లి ఫిబ్రవరి 27 నవభూమి:** ములకలపల్లి మండలంలో గల డిసిబి బ్యాంకు లో వ్యవసాయ రుణాలు, గేదెల రుణాలు, ముద్ర రుణాలు, మార్ట్ గేజ్ రుణాలు పొందిన వారు వారి రుణాలను వాయిదాల పద్ధతిలో సకాలంలో చెల్లించాలని ములకలపల్లి డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ సతీష్ కోరినారు. వ్యవసాయ రుణాలు పొందిన వారు సంవత్సరం లోపు రెన్యువల్ చేయడం ద్వారా ఏడు శాతం మాత్రమే వడ్డీ పడుతుందని, నిర్దిష్ట తేదీ లోపు చెల్లించిన వారికి తిరిగి మూడు శాతం వారి ఖాతాకు జమవుతుందని వారు అన్నారు. అలా కాకుండా సంవత్సరంలోపు రెన్యువల్ చేయకపోయినచో అధిక వడ్డీ చెల్లించవలసి వస్తుందని వారు అన్నారు. ఇంకా ఎక్కువ సమయం అయినచో యన్ పీ ఏ ఖాతాదారులు గా గుర్తించబాడుతున్నారు అని అన్నారు. విషయంపై బ్యాంకు ఖాతాదారులు అందరూ అవగాహన పెంచుకొని సరైన సమయంలో రుణాల వడ్డీలను చెల్లించాలని కోరారు. ఖాతాదారులు మార్చి 15 లోగా రెన్యువల్ చేసుకోవాలని కోరారు. ఏ విధమైన బ్యాంకు అవసరాలు వున్న, ఎటువంటి సందేహాలు ఉన్న నేరుగా ఖాతాదారులే బ్రాంచి ని సంప్రదించాలని, దళారుల వద్దకు వెళ్లవద్దని సూచించారు.

## ఆసుపత్రిలో ప్రజలకు మరింత అత్యాధునిక సేవలు, వైద్యులు మాధవి వెల్లడి





**కల్లూరు, నవభూమి, ఫిబ్రవరి 27:** కల్లూరు, పెనుబల్లి, తల్లాడ మండలాల పరిసర ప్రాంత ప్రజలకు మరింత అత్యాధునిక వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో కల్లూరులోని మాధవి ఆసుపత్రిలో లాప్రోస్కోపి ద్వారా ఆపరేషన్లు చేసే సౌకర్యాన్ని కల్పించినట్లు ఆసుపత్రి వైద్యులు డి మాధవి ఎమ్మెస్ ఓ బి జి ( స్త్రీ మరియు ప్రసూతి వైద్య నిపుణులు) తెలిపారు. ఆసుపత్రిలో క్యూబెక్టమి (పిల్లలు పుట్టకుండా ) ఆపరేషన్లు, గర్భసంచిలో ఏర్పడిన గడ్డలు, కణుతులు తీసి వేయుట, సంతాన లేమి గల వారికి ఇన్ఫెర్టిలిటి ట్రీట్మెంట్, అపెండిక్స్ ( 24 గంటల కడుపు నొప్పి) లాంటి ఆపరేషన్లు, స్త్రీలకు సంబందించిన శాస్త్ర చికిత్సలు ఓపెన్ చెయకుండా సులభతర ఆపరేషన్ లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్మెంట్ ఉద్యోగులకు ఫీజ్ రియంబర్స్ మెంట్ సదుపాయం కూడా కల్పించామని, కల్లూరు తో పాటు పరిసర మండలాల ప్రజలు వైద్య సేవలకు దూరప్రాంతాలకు వెళ్ళే పని లేకుండా అందుబాటులోకి తెచ్చినందున సద్వినియోగ చేసుకోవాల్సిందిగా కోరారు. వైద్యులు మాధవి గత 15 సంవత్సరాలుగా కల్లూరులో లక్కినేని రఘు వీధిలో గల ఆసుపత్రిలో రోగులకు వైద్య చికిత్సలు అందిస్తూ, మన్ననలు పొందారు.

## కెనడా అంతర్జాతీయ కథల పోటీల్లో సాత్విక్‌కు బహుమతి






**అశ్వారావుపేట రూరల్ ఫిబ్రవరి 27 నవభూమి:** తెలుగు తల్లి కెనడా, గడుగ్గాయి పిల్లల మాసపత్రిక వారు అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన కథల పోటీల్లో అశ్వారావుపేటకు చెందిన బాలకథా రచయిత సిద్ధాంతపు సాత్విక్ కు ప్రత్యేక బహుమతి లభించింది. వివిధ దేశాల్లో నివసిస్తున్న తెలుగు వారి పిల్లల నుండి కెనడా కు చెందిన గడుగ్గాయి ప్రపంచ పిల్లల పత్రిక సంపాదకవర్గం వారు నిర్వహించిన ఈ కథల పోటీల్లో సాత్విక్ తాను రాసిన నిజాయితీ విలువ కథను పంపించగా ఈ కథ ప్రత్యేక నగదు బహుమతికి ఎంపిక అయింది. ఇందుకు సంబంధించిన ధృవీకరణ పత్రాన్ని మెయిల్ ద్వారా సాత్విక్‌కు పంపించారు. ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో తన కథకు బహుమతి రావడం పట్ల నిర్వాహకులకు, సంపాదకవర్గ సభ్యులు డాక్టర్ చదలవాడ ఉదయశ్రీ, బాలాంత్రపు లావణ్య, రాయవరపు లక్ష్మి లకు సాత్విక్ ధన్యవాదాలు తెలిపాడు. తన కుమారుడికి అంతర్జాతీయ బహుమతి లభించడం పట్ల ప్రముఖ సాహితీవేత్త సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు సంతోషం వ్యక్తం చేశారు.

## సయ్యద్ పల్లి గ్రామంలో అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణం

**వికారాబాద్ జిల్లా ఫిబ్రవరి 27 (నవభూమి) ప్రతినిధి-** వికారాబాద్ జిల్లాలోని పరిగి మండలం సయ్యద్ పల్లి గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈరోజు శివ పార్వతుల కళ్యాణం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సయ్యద్ పల్లి మల్లికార్జున స్వామి దేవాలయ కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ బి పరుశురాం రెడ్డి..

### నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ

# ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రతి దశలో ప్రజలకు అండగా ఉంటాం
- కుక్కల బెడద సమస్య పరిష్కారానికి పటిష్ట చర్యలు
- ఏన్కూరు మండలం రేపల్లెవాడ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లపై లబ్ధిదారులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



**ఖమ్మం నవభూమి బ్యూరో, ఫిబ్రవరి 27:** నిధులను సమర్ధవంతంగా వినియోగించుకుంటూ లబ్ధిదారులు నాణ్యతతో కూడిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ఏన్కూరు మండలం, రేపల్లెవాడ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రణాళిక వివరాలను కలెక్టర్ లబ్ధిదారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. గ్రామంలో రైతులు ఎటువంటి పంటలు పండించుకుంటు న్నారు, దిగుబడి ఎంత వస్తుంది, గ్రామాల్లో ఇతర సమస్యల గురించి కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు ఎలా కట్టుకోవాలి అనే స్వేచ్ఛ పూర్తిగా లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిందని అన్నారు. సొంత ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందించే ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని పూర్తి స్థాయిలో సమర్థతతో వినియోగిస్తూ నాణ్యతతో కూడిన ఇంటి నిర్మాణం చేయాలని అన్నారు. ఇంటి నిర్మాణం ప్రణాళిక, ఎంత ఇసుక అవసరం, ఎంత సిమెంట్, ఇటుక కావాలి మొదలగు అంశాల పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే మేస్త్రీలు తక్కువ ఖర్చుతో ఇంటి నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని, నాణ్యతతో కూడిన పరికరాలు తక్కువ ధరకు కొనుగోలు చేసేలా చొరవ చూపాలని కలెక్టర్ కోరారు. ఏన్కూరు మండల హెడ్ క్వార్టర్ తహసిల్దార్ కార్యాలయంలో మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం జరుగుతుందని, అక్కడ చూసి అవసరమైన వారు నేర్చుకోవాలని అన్నారు.

మన దగ్గర ఉన్న డబ్బును దుర్వినియోగం చేసుకోకుండా నాణ్యతతో ఇండ్లు నిర్మించుకునేందుకు ఈ అవగాహన కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. మనం కట్టుకునే ఇంటిలో చార్జింగ్ పాయింట్స్ ఎక్కడ పెడుతున్నాం, మిక్సీ పెట్టుకోవడానికి కేబుల్ ఎక్కడ ఉంటుంది వంటి ప్రతి అంశాన్ని కూడా ప్లాన్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి చిన్న అంశంలో మనం శ్రద్ధ వహించి ఇంటి నిర్మాణం చేస్తే ఆశించిన బడ్జెట్లో మంచి ఇల్లు మనకు సిద్ధమవుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం అవసరమైన ఇసుకను ప్రతి మండల కేంద్రానికి తీసుకుని వచ్చే బాధ్యత జిల్లా యంత్రాంగం తీసుకుంటుందని, మండల కేంద్రం నుంచి లబ్ధిదారుడు ఇంటి నిర్మాణానికి తక్కువ ధరతో ఇసుక తరలించేలా చూడాలని అన్నారు. మండల కేంద్రంలో పెట్టే ఇసుక డంప్ దుర్వినియోగం కాకుండా చూసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సంపూర్ణ అవగాహన ఉండాలని కలెక్టర్ తెలిపారు. భూమి పూజ నుంచి గృహప్రవేశం వరకు ఇంటి నిర్మాణంలో ప్రతి అడుగులో లబ్ధిదారులకు తోడ్పాటు అందిస్తామని అన్నారు. సిమెంట్ కూడా ఇందిరమ్మ లబ్ధిదారులకు తక్కువ ధరకు సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని, ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని అన్నారు. రేపల్లె వాడ గ్రామంలో కుక్కల సమస్య గురించి తెలుసుకున్న కలెక్టర్ వీధి కుక్కలను పట్టుకొని ఖమ్మంలో ఉన్న ఆనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ లో వాటికి ఆపరేషన్ చేయించాలని ఎంపీడీఓ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ పిడి శ్రీనివాసరావు, ఏన్కూరు మండల తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపిడివో రమేష్, రేపల్లెవాడ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు









## పేకాట రాయుళ్ళపై పోలీసుల దాడి-11 మంది అరెస్టు

**రామకృష్ణాపూర్-నవభూమి-** రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరం పై బుధవారం పట్టణ పోలీసులు అస్మిక తనిఖీ నిర్వహించారు. పట్టణ ఎస్ఐ జి రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం రాత్రి సమయంలో తమ సిబ్బందితో కలిసి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామం లోని ముత్యాల ప్రదీప్ అనే అతని ఇంట్లో కొంతమంది జూదరులు రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరం పై ఆకస్మిక దాడి నిర్వహించామని తెలిపారు. పేకాట ఆడుతున్న పదకొండు మంది పేకాట రాయుళ్ళని పట్టుకుని వారి వద్ద నుండి రూ. 38, 290/- రూపాయల నగదు, 4 మోటార్ సైకిల్ లు, ఒక కారు పదకొండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- పరీక్షలలో మెరుగైన ఫలితాల సాధనకు ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలి
- ప్రతి రోజూ కనీసం ఒక గంట సేపు క్రీడల్లో పాల్గొనాలి
- విద్యార్థులు పౌష్టికాహారం మాత్రమే తీసుకోవాలి
- ఏన్కూరు మండలం తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ఏన్కూర్, నవభూమి, ఫిబ్రవరి -27:** విద్యార్థులు జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, లక్ష్య సాధన దిశగా పట్టుదలతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ఏన్కూరు మండలం తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు. రెసిడెన్షియల్ పాఠశాలలో డార్మెంటరీ, హాల్, కిచెన్, భోజనశాల, ప్రహారీ గోడ, తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. రాబోయే ఇంటర్, 10వ తరగతి పరీక్షలకు విద్యార్థులు ఎలా సన్నద్ధమవుతున్నారో వివరాలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి గదిలోకి వెళ్లి, విద్యార్థులను పరీక్షల సన్నద్ధత పై చైతన్యపరిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ విద్యార్థులతో మాట్లాడుతూ మన జీవితంలో గొప్ప స్థాయికి ఎదిగేలా లక్ష్యాలను పెట్టుకోవాలని, భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధనకు కృషి చేయాలని అన్నారు. రాబోయే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని కలెక్టర్ తెలిపారు. మనం వీక్ గా ఉన్న సబ్జెక్టుపై శ్రద్ధ పెట్టాలని, గతంలో జరిగిన పరీక్షల ప్రశ్నా పత్రాలను పరిశీలించి రెగ్యులర్ గా వచ్చే ప్రశ్నలకు సంపూర్ణంగా సిద్ధం కావాలని అన్నారు. రాబోయే నెల రోజులపాటు విద్యార్థులు సెల్ ఫోన్, టీవీ లకు దూరంగా ఉండాలని, పూర్తి సమయం పరీక్షలకు సిద్ధమయ్యేందుకే కేటాయించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం సమయం లేచి చదువుకోవాలని అన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలో ఉదయం అల్పాహారం నుండి మధ్యాహ్నా, రాత్రి భోజనం, స్నాక్స్ ఇస్తున్నది, ఎలా ఉంది రుచికరంగా ఉంటుందా అడిగి తెలుసుకున్నారు. కరివేపాకు పారవేయకుండా భోజనంతోపాటు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. విద్యార్థులు ప్రతిరోజు తప్పనిసరిగా కనీసం ఒక గంట సమయం క్రీడలకు కేటాయించాలని, క్రీడలు ఆడటం వల్ల మనకు ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. క్రికెట్, ఫుట్ బాల్, బ్యాట్మెంటన్, వాలీబాల్ క్రీడలు ఆడేందుకు అవసరమైన కిట్లను శుక్రవారం వరకు గురుకులానికి అందజేయడం జరుగుతుందని అన్నారు. విద్యలో రెగ్యులర్ గా మనం వృద్ధిని సాధించాల్సి ఉంటుందని, మనతో మనం పోటీపడుతూ మన ఉన్నతికి కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. మనం చేయగలం అనే ధైర్యం ఉండాలని, ఇదే మనలను ముందుకు తీసుకెళ్తుందని అన్నారు. భయాన్ని జయించాలని, ఇందుకు ముందస్తు సన్నద్ధత, సానుకూల దృక్పథం ఉంటే భయం ఉండదని అన్నారు. రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల అంతా కలియ తిరిగి తెలంగాణ కావాల్సిన సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్ బ్లాక్స్, 2 హాల్స్, గ్యాప్స్ ఉన్న ప్రహారీ గోడ నిర్మాణానికి చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి, ఏన్కూరు మండల తహసీల్దార్ శేషగిరి రావు, ఎంపిడివో రమేష్, అధికారులు, తదితరులు ఉన్నారు









# బూర్గంపాడు మండల మాల మహానాడు అధ్యక్షులుగా పిల్లి లాలయ్య





**బూర్గంపాడు ఫిబ్రవరి 27 నవభూమి:** బూర్గంపాడు మండలంలో మాల మహానాడు కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు పూల రవీందర్, పినపాక నియోజకవర్గం ఇంచార్జ్ పిల్లి రవి వర్మ, జాతీయ అధ్యక్షుడు ఎర్రమళ్ళ రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పాల్ రాజ్ నాయకత్వంలో బూర్గంపాడు మండల మాల మహానాడు అధ్యక్షులుగా పిల్లి లాలయ్య ను ఏకగ్రీవంగా సమావేశంలో ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా బూర్గంపాడు మండల అధ్యక్షుడు పిల్లి లాలయ్య మాట్లాడుతూ నాపై నమ్మకంతో నాకు బూర్గంపాడు మండల అధ్యక్షుడిగా నియమించినందుకు జిల్లా అధ్యక్షులు పూల రవీందర్ కి పిల్లి రవి వర్మ కి కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న కాలంలో జిల్లా అధ్యక్షులు పూల రవీందర్ ఆదేశాల మేరకు బూర్గంపాడు మండలంలో మాల మహానాడు అభివృద్ధికి కృషి చేస్తానని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా జిల్లా గౌరవాధ్యక్షురాలు రమాదేవి, జిల్లా ఉపాధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు

# గార్లలో ప్రశాంతంగా ఎమ్మెల్సీ పోలింగ్, 92 శాతం నమోదు



**గార్ల, నవభూమి, ఫిబ్రవరి 27:** తెలంగాణ రాష్ట్రం లోని వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం గార్ల లో ప్రశాంతంగా జరిగింది. మండలం లో 157 మంది ఓటర్లు ఉండగా గార్ల మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల అధికారులు ఏర్పాటు చెయ్యగా 144 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 92 శాతం నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గార్ల ఎస్ ఐ షేక్ రియాజ్ పాష ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ను ఏర్పాటు చేశారు

# కారేపల్లి ప్రశాంతంగా ఎమ్మెల్సీ పోలింగ్

**కారేపల్లి, నవభూమి, ఫిబ్రవరి27 :** నల్గొండ, ఖమ్మ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం కారేపల్లిలో ప్రశాంతంగా జరిగింది. మండలంలో 177 ఓట్లకు అధికారులు మూడు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. 177 ఓట్లకు 168 ఓట్లు పోల్కెనాయి. 95 శాతం ఓటింగ్ జరిగింద. ఓటింగ్ సరళిని మండల స్పెషల్ ఆఫీసర్ కే.నవీన్‌బాబు, తహసీల్ధార్ సంపత్‌కుమార్, ఎంపీడీవో సురేంధర్ లు పరిశీలించారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు తమ అభ్యర్ధి కోసం పోలింగ్ కేంద్ర 100 మీటర్ల దూరంలో శిబిరాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ సమీపంలోని దుకాణాలను మూసివేయించారు. సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై ఎన్.రాజారాం ఆధ్వర్యంలో బంద్ బస్తును నిర్వహించారు



# గుత్తాను పరామర్శించిన ఎమ్మెల్సీ తాత మధు





**ఏనుకూరు, నవభూమి, ఫిబ్రవరి 27 :** మండల పరిధిలోని జన్నారం గ్రామానికి చెందిన గుత్తా వెంకటేశ్వరావు తండ్రి అనంతరామయ్య అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన తెలుసుకొని ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తాత మధుసూదన్, మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య, బానోత్ మదన్ లాల్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరామయ్య మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ అధికార ప్రతినిధి లాకావత్ గిరిబాబు,బీఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు యల్లంకి సత్యనారాయణ, ఖమ్మం రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, నాయకులు పొన్నం హరికృష్ణ, ముత్యాల వెంకటప్పారావు, చుంచు విజయ కుమార్, యండ్రాతి మోహన్ రావు, సేవ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు

# గార్ల పెద్ద చెరువు కట్ట అలుగులో పడి వ్యక్తి మృతి



**గార్ల, నవభూమి, ఫిబ్రవరి 27:** గార్ల పెద్ద చెరువు కట్ట అలుగులో ప్రమాదవశాత్తు జారి పడి బయ్యారం గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. గార్ల ఎస్ ఐ షేక్ రియాజ్ పాష కథనం ప్రకారం బయ్యారం గ్రామ నివాసి కత్తి జంపన్న ( 47) తన స్నేహితులు గార్ల పెద్ద చెరువు కట్ట అలుగు వద్ద విందు ఏర్పాటు చెయ్యగా హాజరైన జంపన్న తిరిగి తన స్కూటీపై వెళ్లుతూ జారీ చెరువు కట్ట అలుగులో పడ్డాడు. దీంతో తలకు,చేతులు, కాళ్లకు బలమైన బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్నేహితులు హుటాహుటిన 108 అంబులెన్స్ ద్వారా మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు ఆయన తెలిపారు. మృతుడు జంపన్న భార్య శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు

# నర్సిరెడ్డి గెలుపుతోనే విద్యా సమస్యల పరిష్కారం - యుటీఎఫ్




**కారేపల్లి, నవభూమి, ఫిబ్రవరి 27:** నల్గొండ - ఖమ్మం- వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలుపుతోనే విద్య రంగ సమస్యలు పరిష్కారం అవుతాయని టీఎస్‌యూటిఎఫ్ రాష్ట్ర నాయకులు జీవీ.నాగమల్లేశ్వరరావు, జూనియర్ కళాశాల లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొప్పి శెట్టి సురేష్, కేజీబీవీ ఉపాధ్యాయ సంఘం జిల్లాకార్యదర్శి ఎం.కవిత లు మాట్లాడుతూ స్వార్ధ ప్రయోజనాలు, పైరవీలకు తావులేకుండా విద్యరంగంలో పని చేస్తున్న ప్రతి ఒక్కరి సమస్య పరిష్కారం కు నర్సిరెడ్డి పని చేశారన్నారు. ఆయన గెలుపుకు కృషి చేసిన అభిమానులు వివిధ సంఘాల నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో యూటిఎఫ్ మండల కార్యదర్శి బీ.మంగీలాల్, నాయకులు బాలాజీ, భాస్కర్, బానోత్ రాందాస్, కేలోత్ రాములు, ఈరునాయక్ టీపీటీఎఫ్ నాయకులు శ్రీనివాసరావు, రాంకోటి, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర, సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులు వై.ప్రకాష్, గిరిజన సంఘం నాయకులు మూడు శోభన్, బానోత్ బన్సీలాల్, వజ్జా రామారావు, ముక్కా సీతారాములు, కే.ఉమావతి, యనమగండ్ల రవి, ముండ్ల ఏకాంబరం, తలారి దేవప్రకాశ్, కొత్తూరి రామారావు, రేగళ్ల మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# మోటార్ సైకిల్‌ని ఢీకొట్టిన లారీ

**అన్నపురెడ్డిపల్లి ఫిబ్రవరి 27 నవభూమి:** మండల పరిధిలోని కట్టుగూడెం గ్రామంలో ఉన్నటువంటి సీతారామ కెనాల్ బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ. అబ్బుగూడెం గ్రామానికి చెందిన గడ్డం శ్రీనుకి కుడి కాలుకి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎముక బయటికి రావటం జరిగింది. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్టు సమాచారం. ఘటన స్థలంలో క్లీనర్ ఒక్కడు మాత్రమే ఉన్నాడు. అన్నపురెడ్డిపల్లి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు





# డాక్టర్ బట్టు నాగేశ్వరరావు సేవలను ప్రశంసించిన

## ఎంపీలు ఈటల రాజేందర్, విశ్వేశ్వర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్

- బిఎస్ఎన్ఎల్ సంస్థ అభివృద్ధి వైపుగా కృషి చేస్తాం
- మేడ్చల్ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశంలో పాల్గొన్న టీఏసి హైదరాబాద్ సభ్యులు, అధికార ప్రతినిధి డాక్టర్ భట్టు నాగేశ్వరరావు



**కామేపల్లి, నవభూమి, ఫిబ్రవరి 27 :** మారుమూల గ్రామాలలో తండాలలో గూడాలలో బిఎస్ఎన్ఎల్ టవర్స్ ను ఏర్పాటు చేసి బిఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ సేవలను ప్రజలకు అందించాలని మేడ్చల్ మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ పిలుపునిచ్చారు. గురువారం రాష్ట్ర రాజధాని హైదరాబాదులో మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి,రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమానికి చైర్మన్ లు గా వ్యవహరించారు.టెలికం అడ్వైజరీ కమిటీ సమావేశంలో హైదరాబాద్ అడ్వైజరీ కమిటీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మెంబర్, భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ భట్టు నాగేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. బిఎస్ఎన్ఎల్ సంస్థ పూర్వ వైభవం వచ్చే విధంగా ఎదగడానికి కావలసిన ప్రణాళికలో భాగంగా తన సూచనలను కమిటీ ముందు తెలిపారు. బిఎస్ఎన్ఎల్ టవర్స్ ను ప్రభుత్వ భవనాలపై ఇన్స్టాలేషన్ చేసినట్లయితే సిగ్నల్స్ ఇష్యూ లేకుండా ప్రజలకు బిఎస్ఎన్ఎల్ మంచి నెట్వర్క్ అందించిన సంస్థగా ఉంటుందని,గ్రామాలలో మారుమూలా తండా లలో గూడాలలో నివసించే ప్రజలు కూడా బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ ని ఆదరిస్తారని తద్వారా బిఎస్ఎన్ఎల్ సంస్థ లాభాల బాట పడుతుందని అన్నారు. అందుకుగాను ఈ విషయాన్ని కేంద్ర మంత్రి జ్యోతి రాధిత్య సింధ్య దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని తెలిపారు.ఒకే సంవత్సరంలో 60 టవర్లును తీసేయడం సంస్థకు చాలా పెద్ద నష్టమని ఇలాంటి సంస్థను అభివృద్ధి పదం వైపు నడపాలని విజ్ఞప్తి చేశామన్నారు. నాగేశ్వరరావు సేవలను బి యస్ యన్ యల్ అధికారులు కొనియాడారు. ఎంపీ ఈటల రాజేందర్,ఎం పి కొండ విశ్వేశ్వర్ రెడ్డి,రాజ్యసభ సభ్యులు అనిల్ యాదవ్ స్పందిస్తూ వెంటనే ప్రభుత్వ భవనాల వివరాలు సేకరించి ఎక్కడైతే ఇంటర్నెట్ సమస్య ఎక్కువ ఉన్న ప్రాంతాన్ని గుర్తించి టవర్లు ఇన్స్టాలేషన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అతిథులుగా బిఎస్ఎన్ఎల్ బిజినెస్ పిజియం చంద్రశేఖర్,ఇన్చార్జి పిజియం విజయ్ కుమార్, పిజియం రాజా రామ్మోహన్, పిజియం చంద్రమౌళి, బిఎస్ఎన్ఎల్ సంస్థ అధికారులు, టిఏసి మెంబర్లు పాల్గొని వివిధ అంశాల మీద చర్చించారు

# 2వ రోజు భారీగా తరలివచ్చిన భక్తజనం

**ఖమ్మం రూరల్, నవభూమి, ఫిబ్రవరి 28:** తీర్థాలలోని శ్రీ గంగా పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన (కూడలి) జాతరకు రెండవ రోజైన గురువారం కూడా భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. పలువురు భక్తులు జాగారం ఉండి పుణ్యస్నానాల ఆచరించి స్వామివారిని దర్శించుకుని దీవెనలు అందుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు శివలింగం, నంది విగ్రహం, ధ్వజస్తంభం, సుబ్రమణ్యేశ్వర స్వామి, మర్రి చెట్టు తదితర ప్రదేశాలలో పూజలు నిర్వహించి తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి శ్రీచరణ్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, వివిధ శాఖల అధికారులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించి స్వామివారి దీవెనలు అందుకున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో వారి వారి సిబ్బంది శాఖల వారిగా అందించే సేవలను భక్తులకు అందజేశారు. జాతర వేడుకల్లో భాగంగా పలువురు స్వచ్ఛందంగా భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడంలో తోడ్పాటును అందించారు. పలువురు దాతలు భక్తులకు మంచినీటి సౌకర్యాన్ని కల్పించారు. ఖమ్మం రూరల్ మండలంలోని ఎం వి పాలెం పిహెచ్సి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో విడతలవారీగా సిబ్బంది పాల్గొని భక్తులకు అవసరమైన వైద్య సేవలు అందజేశారు. జాతర ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్ ద్వారా తప్పిపోయిన వారి వివరాలను తెలియపరచి వారి వారి బంధువులకు అప్పగించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థాల కూడలి జాతరకు పూర్వ వైభవాన్ని సంతరింపజేశారు.









## పోలింగ్ కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్

### కట్టుదిట్టమైన భద్రత

### పోలింగ్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ









**ఖమ్మం, క్రైం, నవభూమి, ఫిబ్రవరి 27:** జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. నగరంలోని రిక్కబజార్ స్కూల్ జరుగుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను ఆయన గురువారం పరిశీలించారు. కేంద్రాల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చేసిన ఏర్పాట్లను పరిశీలించారు పోలింగ్ కేంద్రాల్లో రద్దీ ఎక్కువగా ఉండకుండా ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ ముగిసిన ఆనంతరం ఈవీఎం లను స్ట్రాంగ్ రూంలకు సురక్షితంగా తరలించే విధంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. 7 గురు ఏసీపీలు, 16 మంది సీఐలు, 25 మంది ఎస్సైలు 470 పోలీస్ సిబ్బంది ఎన్నికల బందోబస్తుకు విధులు నిర్వహించినట్లు అయన పేర్కొన్నారు

## వినోబా నగర్ వద్ద ఎదురెదురుగా ఢీ కొన్న కార్లు:పలువురికి గాయాలు

**జూలూరుపాడు,ఫిబ్రవరి 27 (నవభూమి ప్రతినిధి)** మండల పరిధిలోని వినోబానగర్ గ్రామ సమీపంలో కొత్తగూడెం ఖమ్మం ప్రధాన రహదారి పై వెళుతున్న రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన గురువారం జరిగింది. రెండు వాహనాల్లో ప్రయాణిస్తున్న వ్యక్తులకు స్వల్ప గాయాలు అయ్యాయి. వాహనాలకు తీవ్ర నష్టం వాటిల్లింది.ప్రమాదం జరిగిన సమాచారం తెలుసుకున్న జూలూరుపాడు పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదంలో గాయపడిన తిరుమలరావు, శ్రీనివాస్ అనే వ్యక్తులను 108 అంబులెన్స్ సహాయంతో కొత్తగూడెం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సంఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు



## సంగమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో

## - 'కొర్లకుంట' వారి నూతన కళ్యాణ మండపం

- తలంబ్రాలను తీసుకొచ్చిన కొర్లకుంట వంశస్థులు
- వైభవంగా స్వామివారి కళ్యాణం
- కళ్యాణ వేడుకలో పాల్గొన్న భక్త జనం

**ఖమ్మం రూరల్, నవభూమి, ఫిబ్రవరి 28:** తీర్థాల సంగమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గల కళ్యాణ మండపానికి 200 ఏళ్ల చరిత్ర ఉంది. అప్పట్లో సంగమేశ్వర స్వామి కళ్యాణాన్ని జరిపించేందుకు పోలేపల్లి గ్రామానికి చెందిన కీర్తిశేషులు కొర్లకుంట పెద్ద అప్పయ్య సొంత ఖర్చులతో కళ్యాణ మండపాన్ని నిర్మించారు. అలాగే వారి ఇంటి నుండే ప్రతి సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా శ్రీ గంగా పార్వతీ సమేత సంగమేశ్వర స్వామికి జరిపించే కళ్యాణ మహోత్సవానికి వేడుకగా నేల తాళాలు నృత్య ప్రదర్శనలతో తలంబ్రాలు తీసుకొని రావడం ఆనవాయితీ. పెద్ద అప్పయ్య మరణాంతరం వారి కుమారులు కొర్లకుంట హనుమయ్య, వెంకట నరసయ్య, రామయ్యలు ఆ ఆనవాయితీని కొనసాగిస్తూ వస్తున్నారు.

అయితే గత ఏడాది సెప్టెంబర్ నెలలో కురిసిన భారీ వర్షాల కారణంగా వచ్చిన వరద ఉధృతికి సంగమేశ్వర స్వామి ప్రాంగణంలో ఉన్న కళ్యాణ మండపం శిథిలమైపోయింది. దీంతో కొర్లకుంట పెద్ద అప్పయ్య వంశస్థులు ఆలయ సమీపంలో నూతన కళ్యాణ మండపాన్ని నిర్మించే బాధ్యతను స్వీకరించారు. అనుకున్నదే తడవుగా కొర్లకుంట హనుమంతరావు మనవడు శ్రీనివాసరావు, ఆయన కుమారుడు కిషోర్, కొర్లకుంట వెంకట నరసయ్య ముదిమనువలు శంకర్రావు, సూరయ్య, వెంకట నరసయ్య, మురళి, కొర్లకుంట రామయ్య మనువలు పెద్ద అప్పయ్య, దామోదర్, సత్యనారాయణ, బాబు, కీర్తిశేషులు కొర్లకొండ శ్యాంసుందర్ కుమారుడు రాము నూతన కళ్యాణ మండపాన్ని అత్యంత సుందరంగా నిర్మించి తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు.

**మేళ తాళాలతో తలంబ్రాలు ఊరేగింపు**

తీర్థాలలోని శ్రీ గంగా పార్వతీ సమేత సంగమేశ్వరుని కళ్యాణ మహోత్సవానికి ఆనవాయితీ ప్రకారం పోలేపల్లి గ్రామానికి చెందిన కొర్లకుంట వారి వంశస్థులు ఒక్కొక్క సంవత్సరం ఒక్కో కుటుంబం వారు తలంబ్రాలను తీసుకొస్తుంటారు. వేడుకల్లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం పోలేపల్లి సమీపంలోని కరుణగిరి సాయినగర్లో నివాసం ఉంటున్న కొర్లకుంట శ్రీనివాసరావు కుటుంబీకులు వారి బంధువులు, భక్తులతో కలిసి ట్రాక్టర్ పై తలంబ్రాలను తీసుకొని మేళ తాళాలు, కోలాటం, నృత్య ప్రదర్శనలు చేస్తూ సంగమేశ్వర ఆలయం వద్దకు చేరుకున్నారు.

**వైభవంగా సంగమేశ్వరుని కళ్యాణం**

తీర్థాల ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపంలో బుధవారం రాత్రి వేలాది మంది భక్త సందోహం మధ్య కల్వకుంట వారి వంశస్థులు పీటలపై కూర్చోగా, ఆలయ ప్రధాన అర్చకులు వేద మంత్రాలు చదివి శ్రీ గంగా పార్వతీ సమేత సంగమేశ్వరులకు అంగరంగ వైభవంగా కల్యాణాన్ని జరిపించారు. గురువారం ఉదయం స్వామి వార్లను ఆలయ ప్రాంగణంలో, తీర్థాల పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి దీవెనలు అందుకున్నారు











## అర్హులైన పెద్దలందరికీ ఇండ్లు మంజూరు

- ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్





**ఏనుకూరు, నవభూమి, ఫిబ్రవరి 27 :** అర్హులైన పేదలందరి విడుతల వారీగా ఇళ్ళు మంజూరు చేస్తామని ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ అన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన రేపల్లెవాడ గ్రామంలో గురువారం ఇళ్ల లబ్ధిదారులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇళ్ల స్కీమ్లో పైలట్ గా ఈ గ్రామాన్ని ఎందుకు చేయడం జరిగిందన్నారు. ఇళ్ల స్కీంను లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇళ్ల నిర్మాణంలో రాజీ పడే ప్రసక్తి లేదని అన్నారు. ఇళ్ల నిర్మాణం పై నిరంతర పర్యవేక్షణ, నిఘా ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే సొమ్మును వృధా చేయకుండా ప్రణాళిక అబద్ధంగా త్వరగా నిర్మించుకోవాలని సూచించారు. సొంతింటి కల పదికాలాలపాటు మన్నికగా ఉండేటట్లు నిర్మించుకోవాలన్నారు. దశలవారీగా అర్హులైన అందరికీ ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇండ్లు రానివారు అధైర్య పడకుండా మరలా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనంతరం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామంలో కుక్కల, కోతుల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు,ఎంపీడీవో సకినాల రమేష్, తహసిల్దార్ సిహెచ్ శేషగిరిరావు, గ్రామ ప్రత్యేక అధికారి అనూష , గ్రామ పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు సుఖసంతోషాలు

### ఆయురారోగ్యాలతో ఉండాలి

### జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**ఖమ్మం రూరల్, నవభూమి, ఫిబ్రవరి 27:** జిల్లాలోని ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామి వారిని ప్రార్థించినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ ఖమ్మం రూరల్ మండలం తీర్థాల సంగమేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ స్వామి వారి చల్లని దీవెనలు భక్తులందరిపై ఉండాలని, జిల్లా ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. దర్శనానంతరం భక్తులతో ఆలయం వద్ద, జాతర సందర్భంగా చేసిన ఏర్పాట్లు ఎలా వున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేశామని జిల్లా కలెక్టర్ తెలిపారు. అనంతరం ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు, అర్చకులు జిల్లా కలెక్టర్ ను శాలువాతో సత్కరించి, ప్రసాదం అందజేశారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, దేవాదాయ శాఖ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు











# జయరాజ్ ప్రకృతి సేవకు రిటైర్మెంట్ లేదు

- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్
- సింగరేణి భవన్‌లో ఘనంగా జయరాజ్ ఉద్యోగ విరమణ
- పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని, సినీ దర్శకులు నర్సింగరావు, సుద్దాల అశోక్ తేజ, వెన్నెల గద్దర్

**హైదరాబాద్ ఫిబ్రవరి 27 (తుమ్మలపల్లి ప్రసాద్ / నవభూమి స్టేట్ బ్యూరో చీఫ్):** జయరాజ్ ఉద్యోగ పరంగా రిటైర్మెంట్ తీసుకున్నప్పటికీ, సమాజానిక, ప్రకృతి కి చేసే సేవకు రిటైర్మెంట్ కాలేదని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. ప్రజాకవి జయరాజ్ సింగరేణి సంస్థ లో ఉద్యోగ విరమణ గురువారం సింగరేణి భవన్ లో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ జయరాజ్ నాకు ఎన్నో సంవత్సరాలుగా ఆత్మీయ మిత్రుడు, సోదర సమానులు, సమాజం యెడల మా ఇద్దరు భావాలు ఒకటే, కవిగా, సమాజ సేవకుడిగా ఒక అంబేద్కరిస్టుగా, ప్రకృతి ప్రేమికుడిగా ఆయన సమాజంలో మరింత మార్పు తీసుకురావాలని మనస్పూర్తిగా ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

జయరాజు పదవి విరమణ సభకు తాను సింగరేణి భవన్ కి రావడం మరచిపోలేని రోజని అన్నారు. సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యలను జయరాజు నా దృష్టికి తీసుకువచ్చారు, వాటిని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరింప చేసేందుకు ప్రయత్నం చేస్తానని అన్నారు. సింగరేణి ని ప్రైవేట్ పరం కానీయకుండా నా వంతు కృషి చేస్తానని హామీ ఇస్తున్నానని స్పీకర్ పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన జయరాజు దంపతులు, కుటుంబం సభ్యులతో శేష జీవితం ఆనందమయంగా గడపాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. మరో ముఖ్య అతిథి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ జయరాజ్, తాను కొత్తగూడెం లో అనేక ఉద్యమాలలో కలిసి పని చేశామని గుర్తు చేసుకున్నారు. ప్రకృతిని పూర్తిగా ఆస్వాదించగలిగినవాడు మా తమ్ముడు జయరాజ్ అని అన్నారు. జయరాజ్ నాకు 30 ఏళ్లుగా స్నేహితుడు అయినందుకు నేను చాలా గర్వపడుతున్నానని, ఆయన నిర్వర్తిస్తున్న రంగాలలో మరింతగా సేవ చేయాలని కోరుకుంటున్నానని కూనంనేని అన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథి డాక్టర్ వెన్నెల గద్దర్ మాట్లాడుతూ జయరాజన్న నాకు తండ్రి సమానులు, నాన్న గద్దరన్నా దూరమయ్యాక, నాకు మొదటిసారి వచ్చిన అవకాశంతో తర్జనభర్జన పడుతున్నప్పుడు, అన్న నాకు ఫోన్ చేశారు. ధైర్యంగా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోమని చెప్పారు. పార్లమెంటు బాటలో మనం





ఉండాలని సూచించారు. నీకు అవకాశం వచ్చింది బిడ్డ, నువ్వు ముందుకెళ్లు నేనున్నానని నాకు దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ సాంస్కృతిక సారథి అవకాశం అప్పుడు కూడా నేను తీసుకోవాలా వద్దా అనే మీమాంశలో ఉన్నప్పుడు నీకు ఏది ఇచ్చినా వద్దనకని అన్నారు. అన్న శేష జీవితం మరింత ఆనందమయంగా సాగాలని కోరుకుంటున్నానని వెన్నెల అన్నారు. సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ ప్రజాకవి, సామాజికవేత్త, రుద్రకవి ఒక మహాకవి, డాక్టర్ జయరాజు ఉద్యోగ విరమణతో పాటల ఆకాశంలో విహరించనున్నాడు.

కొండల్లో అక్షర దీపం వెలగాలి అన్నప్పుడే ఒక పెద్ద పాట దీపంలా ఒక వెలుగులో నా మనసులో నిలిచిపోయినటువంటి అవకాశం దొరికింది. అలా నాతో పాటు సినిమా పాటలు రాసినటువంటి నా పాట స్నేహితుడు, నా పాత స్నేహితుడు కుటుంబం మనిషి, ఇంకా అనేక విజయాలు పొందాలని కోరుకుంటున్నానని అన్నారు. మూడు విజయాలు పొందాలి ఒకటి కుటుంబం జయరాజు అన్న ప్రజల మనసులని ఎంతో గెలిచినాడు, కుటుంబంలో కూడా అంతే బాగా గెలిచినాడు, వాళ్ళ కొడుకు కోడలు పిల్లలు వాళ్ళందరూ ఇప్పటికీ పంచ ప్రాణంగా చూసుకుంటున్నారంటే ఆ ఇంటి కోడల్ని కూడా నేను అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. సినిమాకి అంతర్జాతీయ ఖ్యాతిని అర్జించిన, సినీ డైరెక్టర్ బి నర్సింగరావు మాట్లాడుతూ జయరాజు కారణజన్ముడు అన్నారు. ఆయన చేస్తున్న కార్యక్రమాలు ఆయన్ను రక్షించాయన్నారు. ఉద్యోగ విరమణ పొందినప్పటికీ ప్రపంచంలో ఆయన చేయాల్సింది ఇంకా ఎంతో ఉందని తెలిపారు. సింగరేణి డైరెక్టర్ ఎస్ డి సుబానీ అద్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర నాయకులు రాములు, కార్మిక నేత బొజ్జా బిక్షమయ్య, ప్రముఖ హైకోర్టు న్యాయవాది కదిరే కృష్ణ, మరో గేయ రచయిత యశ్ పాల్, భద్రాద్రి జిల్లా సిపిఐ కార్యదర్శి సాబీర్ పాషా, కార్మిక నేతలు కెంగర్ల మల్లయ్య, సంపత్ కుమార్, కొత్తగూడెం లోని జయరాజు ప్రకృతి ఆశ్రమం కో – ఆర్డినేటర్ జి. సుగుణా రావు, టి. వెంకన్న, అర్జునరావు, భాస్కర్ లు జయరాజు దంపతులకు మొక్కను అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఇంకా అనేక మంది అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, బంధు మిత్రులు పాల్గొన్నారు

